సాక్షి శ్రీసత్యసాయి జిల్లా

సోమవారం ı 23 ı జూన్ ı 2025



నేడు 'పరిష్కార వేదిక'

కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ చేతన్ తెలిపారు.



జిల్లా అంతటా వర్షం

తుపాను ప్రభావంతో జిల్లా అంతటా మోస్తరు వర్షం కురిసింది. ఆరు గంటలు ఫైబడి కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

8లో

గరిష్టం/కనిష్టం

35.9°/22.6°

జిల్లా పరిధిలో ఆదివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం పెరిగింది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా వర్షం కురిసింది. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 16 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

గుమ్మనూరు జయరామ్ వ్యాఖ్యలు సరికాదు

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్



రొద్దం బొక్సంపల్లిలో పర్యటిస్తున్న జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్

రొద్దం: స్థానిక సంస్థల ఎన్నికలు అయ్యాక వైఎస్సార్‌సీపీ వారి అంతు చూస్తామని గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ చేసిన వ్యాఖ్యలు సరికాదని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ అన్నారు. ఆదివారం బొక్సంపల్లి గ్రామ పంచాయతీలో 'కాఫీ విత్ వైఎస్సార్‌సీపీ లీడర్స్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులతో కలిసి ఆమె ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసి గత ప్రభుత్వం.. ప్రస్తుత ప్రభుత్వం పాలనలో తేడాను బేరీజు వేసుకోవాలని సూచించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ 2019లో వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన గుమ్మనూరుకు వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి టికెట్ ఇచ్చి గెలిపించుకుని.. మంత్రి పదవి కట్టబెట్టారని గుర్తు చేశారన్నారు. ఆయన పెట్టిన రాజకీయ భిక్షతోనే జయరామ్ ఎదిగారన్న విషయం గుర్తుంచుకుంటే మంచిదని హితవు పలికారు. టీవీ చానెల్ చర్చావేదికలో ఓ జర్నలిస్టు మాట్లాడిన మాటను తమ పార్టీ అధినేత వైఎస్ జగన్‌కు అంటగట్టి దుష్ప్రచారం చేశారన్నారు. ఇటీవల మీడియా సమావేశంలో ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు 'రప్పా.. రప్పా' అని డైలాగ్ చెప్పగానే పెద్ద రాద్ధాంతం చేస్తున్నారని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను ఉద్దేశించి టీడీపీ నాయకులు రెచ్చగొట్టే విధంగా ప్లకార్డులు ప్రదర్శించినపుడు ఎందుకు స్పందించలేదని నిలదీశారు. హోం మంత్రి అసత్య ఆరోపణలతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించడం మానుకోవాలన్నారు. మీరే రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసి.. మీరే మాపై బురద చల్లాలని చూస్తారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గుర్రం రత్నమ్మ, పార్టీ మండల కన్వీనర్ బి.తిమ్మయ్య, నాయకులు విశ్వనాథ్‌రెడ్డి, ఎన్.నారాయణరెడ్డి, సి.నారాయణరెడ్డి, లక్ష్మీనారాయణ రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, జెట్టి శ్రీనివాస్‌రెడ్డి, చిలకల రవి, హరిన లక్ష్మన్న, గోవర్ధన్‌రెడ్డి, బోయ మారుతి, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కామన్ తేదీ వేసేలా చర్యలు తీసుకోండి

అనంతపురం ఎడ్యుకేషన్: ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల బదిలీల్లో భాగంగా పాఠశాల సహాయకులకు (హిందీ, తెలుగు) ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రిలీవింగ్ తేదీ కామన్‌గా వేసేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ (ఆర్‌యూపీపీ) నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం డీఈఓను కలిసి వినతిపత్రం అందజేశారు. డీఈఓను కలిసిన వారిలో ఆర్‌యూపీపీ జిల్లా గౌరవాధ్యక్షులు సి.ఎర్రిస్వామి, అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు వి.హనుమేష్, జి.తులశి రెడ్డి ఉన్నారు.

ట్యాబ్‌లు, పుస్తకాలు వెనక్కు ఇస్తేనే సర్టిఫికెట్లు

- బాలికల ఉన్నతపాఠశాల సిబ్బంది హుకుం



సర్టిఫికెట్లు అడుగుతున్న విద్యార్థినులు

పెనుకొండ: మీ వద్దనున్న ట్యాబులు, పాఠ్యపుస్తకాలు వెనక్కు ఇస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామని ఉన్నతపాఠశాల సిబ్బంది హుకుం జారీ చేస్తున్నారు. దీంతో సర్టిఫికెట్లు అందక విద్యార్థులు ఉన్నత చదువులకు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారు. పెనుకొండలోని ప్రభుత్వ బాలికల ఉన్నతపాఠశాలలో 2024–25 విద్యా సంవత్సరం 120 మంది విద్యార్థులు పదో తరగతి చదివారు. పరీక్షల్లో ఉత్తీర్ణత చెందిన విద్యార్థులు ఉన్నత విద్యకు వెళ్లాల్సి ఉంది. ఇందుకు అవసరమైన టీసీ, స్టడీ, కాండక్ట్ సర్టిఫికెట్ల కోసం ఉన్నత పాఠశాలకు వెళ్లిన విద్యార్థులకు వింత అనుభవం ఎదురైంది. మీకు ఇదివరకు ఇచ్చిన ట్యాబులు, పదో తరగతి పాఠ్య పుస్తకాలు వెనక్కు ఇచ్చి.. మీ సర్టిఫికెట్లు తీసుకెళ్లండంటూ క్లర్క్ చెబుతున్నారు. ఇది హెచ్‌ఎం ఆర్డర్ అని అంటున్నారు. మీరు వెనక్కు ఇచ్చిన స్టడీ మెటీరియల్‌ను ప్రస్తుత విద్యాసంవత్సరపు టెన్త్ విద్యార్థులకు అందజేస్తామని తెలిపారు. ఒకవేళ వాటిని తెచ్చివ్వకపోతే సర్టిఫికెట్లు ఇచ్చేది లేదని చెబుతుండటంతో క్లర్క్‌తో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు గొడవకు దిగుతున్నారు.

వెనక్కివ్వాలని ఎలా అడుగుతారు?

స్టడీ మెటీరియల్ వెనక్కు ఇస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామని మెలిక పెట్టడంపై ఎంఈఓ సుధాకర్, డీవైఈఓ పద్మప్రియను వివరణ కోరగా.. ట్యాబులు, పాఠ్యపుస్తకాలు వెనక్కు ఇవ్వాలని ఎలా అడుగుతారు? అలాంటి ఆదేశాలు ఏవీ లేవని అన్నారు. అలా ఎందుకు అడుగుతున్నారో హెచ్‌ఎంతో మాట్లాడి కనుక్కుంటామన్నారు.

భృతి.. అంతా భ్రాంతి

అధికారం కోసం యువతకు అలవిగాని హామీలు గుప్పించారు. లేనిపోని ఆశలు కల్పించారు. అయితే, బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తయినా ఒక్క హామీ అమలు చేయకుండా కుచ్చుటోపీ పెట్టారు. ఈ క్రమంలో యువతకు బాసటగా, కూటమి ప్రభుత్వ కపటత్వాన్ని నిరసిస్తూ, హామీల అమలు కోసం వైఎస్సార్‌సీపీ సోమవారం పుట్టపర్తిలో 'యువత పోరు'కు పిలుపునిచ్చింది.







వైఎస్సార్‌సీపీ నేతలతో కలిసి యువత పోరు పోస్టర్లు విడుదల చేస్తున్న ఉషశ్రీచరణ్

యువతకు చంద్రబాబు అండ్ కో మోసం

- ఏడాదికి 4 లక్షల ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్ హామీ హుళక్కి
- కానరాని 'ప్రతి నిరుద్యోగికీ నెలకు రూ. 3 వేల భృతి'
- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించని వైనం
- ఉన్నత విద్యకు దూరమవుతున్న పేద విద్యార్థులు
- 'కూటమి' కపటత్వాన్ని నిరసిస్తూ నేడు వైఎస్సార్‌సీపీ 'యువత పోరు'

పుట్టపర్తి: యువతకు ఏడాదికి 4 లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం... ఉద్యోగం వచ్చే వరకు ప్రతి నిరుద్యోగికీ నెలకు రూ.3 వేల భృతి అందిస్తాం.. అంటూ గత సార్వత్రిక ఎన్నికల్లో యువతను మభ్యపెట్టిన చంద్రబాబు అండ్ కో.. నేడు ఆ ఊసే ఎత్తడం లేదు. పథకాలకు పేర్లు మార్చారే కానీ అమలు మాత్రం చేయడం లేదు. కొత్త ఉద్యోగాల మాట దేవుడెరుగు ఉన్న ఉద్యోగాలనూ తొలగించి రోడ్డుపాలు చేస్తున్నారు. మరోవైపు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకుండా పేద విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేస్తున్నారు. ఇంటికి దూరంగా ఉంటూ ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సాయంతో హాస్టళ్లలో చదువుకుంటున్న విద్యార్థులకు 'వసతి దీవెన' అందించకపోవడంతో అప్పు భారం పడి ఆందోళన చెందుతున్నారు.

ఫీజు కడితేనే సర్టిఫికెట్లు..

చంద్రబాబు ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు. ఉన్నత విద్య, ఉద్యోగాల సమయంలో సర్టిఫికెట్లు తప్పనిసరి కావడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో వారి తల్లిదండ్రులు అప్పులు చేసి మరీ కాలేజీలకు ఫీజులు చెల్లిస్తున్నారు. వాస్తవానికి గడిచిన విద్యా సంవత్సరంలో చివరి రెండు త్రైమాసికాలకు ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన జూన్ నెలలో చెల్లించడానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. మళ్లీ వైఎస్ జగన్ ప్రభుత్వం వచ్చి ఉంటే నిధులు విద్యార్థుల తల్లిదండ్రుల ఖాతాల్లోకి జమయ్యేవి. కానీ, కూటమి అధికారంలోకి వచ్చింది. ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన ఖర్చులను నిలిపివేసింది.

పాత బకాయిలు విడుదల చేసిన ఘనత జగన్‌దే..

పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఉన్నత విద్యను అందించాలనే లక్ష్యంతో వైఎస్ జగన్ వసతి దీవెన పథకం కింద ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేశారు. ప్రతి త్రైమాసికానికి ముందే షెడ్యూల్ ప్రకటించి నిధులు విడుదల చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రుల ఖాతాల్లోకి ఫీజు మొత్తాన్ని జమ చేసే విధానాన్ని తెచ్చారు. పైగా రాజకీయాలకు అతీతంగా 2017–19 మధ్య టీడీపీ ప్రభుత్వం పెట్టిన బకాయిలను సైతం జగన్ ప్రభుత్వం చెల్లించడం గమనార్హం.

గతమెంతో ఘనం..

యువతకు ఉపాధి, ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 2.25 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసింది. స్వాతంత్య్రం వచ్చిన తరువాత తొలిసారి ఇంత పెద్ద ఎత్తున ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేసిన ఘనత మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కింది. జిల్లాలో 18 వేల సచివాలయ ఉద్యోగాలు, ప్రభుత్వ శాఖల్లో 8 వేల ఉద్యోగాల భర్తీతో పాటు ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసి ఊరట కల్పించారు.

నిరుద్యోగులను పట్టించుకోని ప్రభుత్వం



గత ప్రభుత్వం తొలి రెండేళ్లలో ఏకంగా 5 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తే.. ప్రస్తుత కూటమి సర్కార్ ఏడాది దాటినా ఇప్పటి దాకా ఒక్క ఉద్యోగమూ భర్తీ చేయలేదు. నిరుద్యోగ భృతి ఇవ్వలేదు ఆ దిశగా ఎలాంటి ప్రకటనా చేయలేదు. అసలు నిరుద్యోగుల గురించే పట్టించుకోవడం లేదు.

– అనిల్, నిరుద్యోగి, బుక్కపట్నం

యువత పోరును విజయవంతం చేయండి

సోమందేపల్లి: 'యువత పోరు' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ పిలుపునిచ్చారు. ఆదివారం సోమందేపల్లిలో 'యువత పోరు' పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించే కార్యక్రమానికి యువత, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు. యువతకు 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని, అంతవరకూ నెలకు రూ.3వేల చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పిన చంద్రబాబు నేడు ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. మరోవైపు ఫీజురీయింబర్స్‌మెంట్–ఉపకార వేతనాలు విడుదల చేయకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. యువత పోరు కార్యక్రమం ద్వారా ప్రభుత్వాన్ని మేల్కొల్పుతామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్‌లు గజేంద్ర, శ్రీనివాసులు, జెడ్పీటీసీ అశోక్, వైస్ ఎంపీపీ వెంకట నారాయణరెడ్డి, సర్పంచ్ అంజినాయక్, నాయకులు ఆదినారాయణరెడ్డి, కంబాలప్ప, మంజు, ఈశ్వర్, జితేంద్రరెడ్డి, శ్రీరాములు రమేష్, కళ్యాణ్, ఇమామ్ వలి, ప్రతాప్‌రెడ్డి, నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా గణాంకాలు..

పీజీ, ఎంటెక్ చేసిన వారు	36,090
డిగ్రీ, బీటెక్, బీఎడ్ చేసిన వారు	93,000
టీటీసీ సమానమైన కోర్సులు చేసిన వారు	18,009
వృత్తి విద్య, ఐటీఐ కోర్సులు చేసిన వారు	33,012
ఇతర విద్యావంతులు	1,13,000

2019-20 నుంచి 2023-24 వరకు జిల్లాలో ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇలా

విద్యా సంవత్సరం	విద్యార్థుల సంఖ్య	మొత్తం (రూ.కోట్లలో)
2019-20	40,136	90.27
2020-21	44,082	73.54.
2021-22	43,872	86.44.
2022-23	37,193	64.66

వసతి దీవెన...

విద్యా సంవత్సరం	విద్యార్థుల సంఖ్య	మొత్తం (రూ.కోట్లలో)
2019-20	39,119	41.14
2020-21	43,301	43.57
2021-22	43,016	43.16
2022-23	36,312	34.51

నిరుద్యోగ భృతి ఇవ్వాలి



ప్రతి నిరుద్యోగికి రూ.3 వేల భృతి అందించాలి. కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చి ఏడాది కాలం పూర్తయినా ఇంత వరకు ఆ ప్రస్తావనే లేదు. ఇప్పటికైనా బకాయిలతో సహా భృతి చెల్లించాలి. త్వరితగతిన ఉద్యోగాలు ఇచ్చేందుకు చర్యలు చేపట్టాలి.

– పురుషోత్తం, జిల్లా అధ్యక్షుడు, వైఎస్సార్ విద్యార్థి విభాగం

ఇబ్బందిగా ఉంది



నేను బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్నా. ఇప్పటి దాకా ఫీజు రీయింబర్స్‌మెంట్ సొమ్ము రూ.10 వేలు మాత్రమే విడుదల చేశారు. ఇంకా చాలా రావాల్సి ఉంది. ఇక వసతి దీవెన సొమ్ము రూ.20 వేలు ఇప్పటికీ జమ కాలేదు. చాలా ఇబ్బందిగా ఉంది.

– ఈశ్వర్, కొత్తచెరువు

మా బాధలు పట్టించుకోరా?

- బదిలీల ఖాళీలపై ఎంటీఎస్ టీచర్ల రగడ
- 80 శాతానికి పైగా కర్ణాటక సరిహద్దు మండలాల్లో ఉన్నాయంటూ ఆవేదన
- సైన్స్ సెంటర్‌లో కౌన్సెలింగ్ అడ్డగింత.. బాయ్‌కాట్

అనంతపురం ఎడ్యుకేషన్: తమబాధలు పట్టించుకోవడం ప్రభుత్వం పొమ్మనలేక పొగ పెడుతోందంటూ ఎంటీఎస్ టీచర్లు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో మొత్తం 594 మంది ఎంటీఎస్ టీచర్లు పని చేస్తున్నారు. 693 ఖాళీలు చూపించారు. వీటిలో 80 శాతం దాకా జిల్లా సరిహద్దు (కర్ణాటక రాష్ట్రం బార్డరు) మండలాల్లోనే ఉన్నాయి. ఆదివారం ఉదయం 9 గంటలకే జిల్లా సైన్స్ సెంటర్‌కు బదిలీల కౌన్సెలింగ్ కోసం ఎంటీఎస్ టీచర్లు చేరుకున్నారు. ఈ క్రమంలోనే ఖాళీల సమాచారం తెలుసుకున్న ఎంటీఎస్ టీచర్లు తీవ్ర ఆవేదన వ్యక్తం చేసి ఆందోళనకు దిగారు. మెజార్టీ ఖాళీలు గుడిబండ, డి.హీరేహాళ్, అమరాపురం, అగళి, బొమ్మనహాళ్, బ్రహ్మసముద్రం, కంబదూరు, రాయదుర్గం, శెట్టూరు, కణేకల్లు మండలాల్లో చూపించారని వాపోయారు. తక్కిన మండలాల్లో 1,2,3 పోస్టులు మాత్రమే చూపించారన్నారు. తక్కువ వేతనంతో పని చేస్తున్నామని, డీఏ, హెచ్‌ఆర్‌ఏ సౌలభ్యం కూడా ఉండదని, అలాంటి తమను అంతంత దూరం వంపితే ఎలా అని వాపోయారు. దీనికితోడు చాలామంది రిటైర్మెంట్‌కు దగ్గరలో ఉన్నారన్నారు. గత ప్రభుత్వం తమకు 'నియర్ బై రెసిడెంట్' ఉత్తర్వులిస్తే...ఈ ప్రభుత్వం 'లాంగ్ బై రెసిడెంట్' ఉత్తర్వులు ఇస్తోందంటూ మండిపడ్డారు.



బాయ్‌కాట్ చేసి బయటకు వెళ్తున్న ఎంటీఎస్ టీచర్లు

డీఈఓను అడ్డుకుని నిరసన

కౌన్సెలింగ్ కేంద్రానికి వచ్చిన డీఈఓ ప్రసాద్‌బాబును ఎంటీఎస్ టీచర్లు అడ్డుకున్నారు. కార్పొరేషన్‌తో పాటు అన్ని మునిసిపాలిటీలతో పాటు ఏకోపాధ్యాయుడు ఉండే స్కూళ్లను ఖాళీగా చూపించాలని పట్టుబట్టారు. ఆందోళన చేస్తున్న విషయాన్ని డీఈఓ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారి నుంచి ఎలాంటి స్పందన లేదు. వారి నుంచి ఏదైనా ఆదేశాలు వస్తే ఆమేరకు ముందుకెళ్తామని స్పష్టం చేశారు. అయితే, రాత్రి 7 గంటల సమయానికి కూడా స్పష్టత రాకపోవడంతో బాయ్‌కాట్ చేస్తున్నట్లు ప్రకటించి ఎంటీఎస్ టీచర్లు వెళ్లిపోయారు. ఎంటీఎస్ టీచర్లకు ఎస్టీయూ జిల్లా అధ్యక్ష,ప్రధానకార్యదర్శులు రమణారెడ్డి, రామాంజనేయులు, వైఎస్సార్‌టీఏ జిల్లా అధ్యక్షుడు నాగిరెడ్డి, గోపాల్, వెంకటరమణ, ఏపీటీఎఫ్ నాయకులు వెంకటేష్, సిరాజుద్దీన్, నరసింహులు, నాగరాజు, తదితరులు మద్దతు తెలిపారు.



డీఈఓను చుట్టుముట్టిన దృశ్యం

ఓ సంఘం నాయకులపై తిరగబడ్డ ఎంటీఎస్ టీచర్లు

కాగా ఓ సంఘం నాయకులు అక్కడికి చేరుకుని అధికారుల మెప్పు పొందేందుకు ఎంటీఎస్ టీచర్లను బెదిరించే ధోరణిలో మాట్లాడారు. 'మీ పోస్టులు చట్టబద్ధం కావు. అనవసరంగా ఇబ్బంది పడతారు. మీర డుగుతున్నట్లు అన్ని ఖాళీలు చూపించడం వీలుకాదు. సజావుగా కౌన్సెలింగ్ జరిగేందుకు సహకరించండి' అంటూ మాట్లాడగా అప్పటికే తీవ్ర అసహనంతో ఉన్న వారు తిరగబడ్డారు. మా బాధలు అర్థం కావడం లేదా.. అని మండిపడ్డారు. తక్కువ వేతనంతో పని చేస్తున్నామని, వయసుపైబడి రిటైర్‌మెంట్‌కు చాలామంది దగ్గరలో ఉన్నారని అలాంటి వారు ఎలా వెళ్తారో తెలీదా అని నిలదీయడంతో ఆ సంఘం నాయకులు అక్కడి నుంచి మెల్లిగా జారుకున్నారు.


కరెంట్.. కటకట

- పుట్టపర్తిలోని గోవిందపేటకు చెందిన ఓ చిన్న కుటుంబం కేవలం కరెంటు పొయ్యి మీద ఆధారపడి వంట చేస్తోంది. అయితే ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కరెంటు లేకపోవడంతో బయటి హోటల్ నుంచి ఆహారం తెచ్చుకుని తిన్నట్లు ఆ నవదంపతులు తెలిపారు. కరెంటు కోతల కారణంగా ఇబ్బందులు తలెత్తుతున్నట్లు పేర్కొన్నారు.
- పుట్టపర్తి మున్సిపాలిటీ ఎనుములపల్లిలో ఓ యువకుడు ఇంటి నుంచి ఉద్యోగం (వర్క్ ఫ్రం హోం) చేస్తున్నాడు. విదేశీ కంపెనీ కావడంతో ఆదివారం కూడా విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. కానీ.. ఎలాంటి సమాచారం లేకుండా ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కరెంటు కోత విధిస్తుండటంతో ఉద్యోగం చేయలేక ఇబ్బంది పడినట్లు పేర్కొన్నాడు. ముందస్తు సమాచారం ఉంటే.. ఇతర ప్రాంతాలకు వెళ్లి లాగిన్ అయ్యే పరిస్థితి ఉండేదని వివరించాడు.
- పుట్టపర్తిలోని గోకులంలో ఓ చిల్లర దుకాణంలో ఫ్రిజ్‌లో నిల్వ ఉంచిన పదార్థాలన్నీ దెబ్బ తిన్నాయి. ఉదయం నుంచి కరెంటు కోతలు ఉండటంతో ఐస్ క్రీమ్‌లు, చాక్లెట్లు కరిగిపోయినట్లు తెలిపాడు. మధ్యాహ్నం తర్వాత విద్యుత్ వచ్చినప్పటికీ అప్పటికే నష్టం జరిగినట్లు చెప్పాడు. సుమారు రూ.5 వేల నష్టం వాటిల్లినట్లు పేర్కొన్నాడు. మిగతా సరుకులు కూడా కూలింగ్ లేక సేల్ కాలేదని వాపోయాడు.

పుట్టపర్తిలో రాత్రింబవళ్లు అవస్థలు

- శని, ఆదివారాల్లో సమాచారం లేకుండా కోతలు
- ఇబ్బందులు పడుతున్న ఉద్యోగులు, గృహిణులు
- ఉదయం వంట చేయలేక మహిళల ఇబ్బందులు
- వర్క్ ఫ్రమ్ హోమ్ విధులకూ తప్పని తిప్పలు

సాక్షి, పుట్టపర్తి: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం పుట్టపర్తిలో అనధికారిక కరెంటు కోతలు ఎక్కువయ్యాయి. ప్రతి శని, ఆదివారాల్లో అయితే ఎడాపెడా కరెంటు తీసేస్తుండటంతో మహిళలు, ఉద్యోగులు, వ్యాపారులు తదితర అన్ని రంగాల వారు ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 20 వార్డుల్లోనూ సమస్య తలెత్తుతోందని వాపోతున్నారు. ఏ ఒక్క ప్రాంతంలో కూడా విద్యుత్ సరఫరా లేకపోవడంతో అవస్థలు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వంట చేసుకునేందుకు ఇబ్బందిగా ఉందని మహిళలు చెబుతున్నారు. ఇంటి నుంచి ఉద్యోగం చేస్తున్న ఉద్యోగులకు తిప్పలు తప్పడం లేదు. వ్యాపారులకు పలు రకాలుగా నష్టం వాటిల్లుతోంది.



కరెంటు కోతలతో కూలింగ్ కావాల్సిన సరుకులు పనికి రాకుండా పోతున్నాయి.

ఉదయం నుంచి వెతలే

ఓ వైపు వాతావరణ మార్పులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నపళంగా వర్షం రావడం .. ఆ తర్వాత ఎండ కాయడం.. మరి కాసేపటికే చీకటి అవుతోంది. ఇంకో వైపు కరెంటు కోతలు ముప్పుతిప్పలు పడుతున్నాయి. విద్యుత్‌తో నడిచే పరికరాలతో వంట చేయడం అలవాటుగా మార్చుకున్న సమాజంలో కరెంటు కోతలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.

పుట్టపర్తి పట్టణ గణాంకాలు

నివాసాలు	12 వేలు
దుకాణాలు	300
జనాభా	35 వేలు
విద్యుత్ కనెక్షన్లు	19 వేలు



మరమ్మతుల వల్లే అంతరాయం

అకాల వర్షాలతో పుట్టపర్తిలో కొన్ని చోట్ల విద్యుత్ అంతరాయం ఏర్పడింది. విద్యుత్ స్తంభాలు మరమ్మతులకు గురయ్యాయి. అక్కడక్కడా పనుల నిమిత్తం మాత్రమే కోతలు విధించాం. వర్షం కారణంగా ఉన్నపళంగా మరమ్మతులు చేయాల్సి ఉండటంతో కోతలు విధిస్తున్నట్లు ఒక రోజు ముందుగానే చెప్పలేకపోతున్నాం.

– సాయినాథ్, విద్యుత్ ఏఈ, పుట్టపర్తి

ముందస్తు సమాచారం లేదు



కరెంటు కోతలు విధించే పరిస్థితి ఉన్నప్పుడు.. ముందస్తు సమాచారం ఇస్తే.. ప్రత్యామ్నాయ మార్గం వెతుక్కుంటాం. ఉన్నపళంగా విద్యుత్ కోతలతో ఇంట్లో పనులన్నీ ఎక్కడికక్కడ ఆగిపోతాయి. సెలవు దినం కావడంతో ముందుగా ప్లాన్ చేసుకున్న పనులన్నింటినీ కరెంటు కోతల కారణంగా పక్కన పెట్టాల్సి వస్తోంది.

– రామాంజినమ్మ, బడేనాయక్ తండా, పుట్టపర్తి

ఎడాపెడా కరెంటు కోతలు



రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విద్యుత్ కోతలు ఇష్టారాజ్యంగా విధిస్తున్నారు. ముందస్తు సమాచారం లేకుండా కరెంట్ కట్ చేస్తున్నారు. ఫలితంగా పుట్టపర్తిలో అన్ని రంగాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముందస్తు సమాచారం ఇవ్వడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నట్లు తెలుస్తోంది.

– సి.గంగాదేవి, సాయినగర్, పుట్టపర్తి

క్లుప్తంగా

రోటావేటర్‌లో పడి విద్యార్థి దుర్మరణం


ప్రేమ్‌కైలాష్ (ఫైల్)

రొద్దం: ప్రమాదవశాత్తు రోటావేటర్‌లో పడి ఓ విద్యార్థి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... రొద్దం మండలం రాగి మేకులపల్లికి చెందిన నరసింహులు కుమారుడు ప్రేమ్‌కైలాష్ (14) తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. ఆదివారం సెలవు కావడంతో ఇంటి పట్టునే ఉన్న బాలుడు.. ఓ రైతు పొలాన్ని విత్తుకు సిద్ధం చేసేందుకు వెళుతున్న ట్రాక్టర్ డ్రైవర్‌తో కలసి వెళ్లాడు. పొలంలో ట్రాక్టర్‌కు రోటావేటర్ అమర్చుకుని డ్రైవర్ పొలాన్ని కలియబెడుతుండగా దానిపై కూర్చొని ఉన్న ప్రేమ్‌కైలాష్ పట్టు తప్పి కిందపడ్డాడు. అదే సమయంలో రోటావేటర్ ముందుకు సాగడంతో అందులో చిక్కుకున్నాడు. డ్రైవర్ గమనించి ట్రాక్టర్ ఆపేలోపు ప్రాణాలు కోల్పోయాడు. వెలికి తీసేందుకు వీలు లేనంతగా చిన్నారి శరీరం అందులో చిక్కుకుపోయింది. మొండెం నుంచి తల వేరుపడింది. కుమారుడు మృతితో నరసింహులును అలివేలమ్మ దంపతులు బోరున విలపించారు.సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు. మృతుడి కుటుంబ సభ్యులను గ్రామ సర్పంచ్ సోమిరెడ్డి పరామర్శించి, ఓదర్చారు.

నేడు 'పోలీసు స్పందన'

పుట్టపర్తి టౌన్: జిల్లా పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎస్పీ వి.రత్న ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. అర్జీదారులు తమ వెంట ఆధార్ కార్డును తప్పని సరిగా తీసుకురావాలి.

ప.గో. జిల్లా వాసుల పర్తి యాత్ర


కోరిక నృత్యరూపకంలోని సన్నివేశం

ప్రశాంతి నిలయం: పర్తి యాత్రలో భాగంగా పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన పలువురు సత్యసాయి భక్తులు ఆదివారం పుట్టపర్తికి చేరుకున్నారు. సాయంత్రం ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహాసమాధి చెంత పలు సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. జీవితంలో కోరికల మూలంగా జరిగే పరిణామాలను వివరిస్తూ కోరిక పేరుతో బాలవికాస్ చిన్నారులు ప్రదర్శించిన నృత్యరూపకం ఆకట్టుకుంది.

ప్రతి గొర్రెకూ ఓ ధర!

- టీడీపీ నేతల నయా దందా
- సంతలో నుంచి గొర్రె బయటకు పోతే రూ.20 చెల్లించాలి
- ప్రతి సోమవారం అప్పనంగా రూ.50వేలకు పైగా అక్రమ వసూళ్లు


కోన రోడ్డులోని సంతలో గొర్రెలను విక్రయిస్తున్న దృశ్యం (ఫైల్)

యాడికి: ఉమ్మడి జిల్లాలో ఉరవకొండ, కదిరి తర్వాత మేకలు, గొర్రెల సంతకు యాడికి ఖ్యాతి గాంచింది. ప్రతి సోమవారం నిర్వహించే ఈ సంతకు తెలంగాణ, కర్ణాటక నుంచి కూడా పెద్ద సంఖ్యలో వ్యాపారులు వస్తుంటారు. ఏడాది క్రితం వరకూ ఇక్కడ వ్యాపార లావాదేవీలు సక్రమంగా సాగుతూ వచ్చాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ధనార్జనే ధ్యేయంగా కొందరు టీడీపీ నేతలు అక్రమ వసూళ్లకు తెరలేపారు. సంత నుంచి గొర్రె కానీ, మేక కాని బయటకు తీసుకెళితే రూ.20 చెల్లించుకోవాలి. ఇవ్వకుంటే బెదిరింపులకు పాల్పడుతున్నారు.

మార్కెట్ యార్డుకు రూ.24 లక్షల ఆదాయం

యాడికి నుంచి వేములపాడుకు వెళ్లే మార్గంలో ఉన్న వ్యవసాయ సబ్ మార్కెట్ యార్డులో గతంలో ప్రతి సోమవారం గొర్రెల సంత నిర్వహించేవారు. పెద్ద సంఖ్యలో వాహనాల్లో గొర్రెలు, మేకలను తీసుకొచ్చి క్రయవిక్రయాలు సాగించేవారు. ప్రతి సోమవారం 1,500 నుంచి 2,500 వరకూ జీవాలను తీసుకొచ్చి విక్రయిస్తుంటారు. అప్పట్లో తాడిపత్రి మార్కెట్ యార్డుకు చెందిన సిబ్బంది నిర్ణీత రుసుం వసూలు చేసి ప్రభుత్వ ఖజానాకు జమ చేసేవారు. ఇలా గొర్రెల సంత ద్వారా ప్రతి సోమవారం రూ.40 వేలకు పైగా ఆదాయం ప్రభుత్వానికి సమకూరేది. ఈ లెక్కన నెలకు రూ.1.60 లక్షల నుంచి రూ.2 లక్షల దాకా, ఏడాదికి రూ.24 లక్షల వరకూ మార్కెట్ ఫీజులు వసూళ్లయ్యేవి. ఇక పండుగల సందర్భంలో ఈ ఆదాయం రెట్టింపు స్థాయిలో ఉండేది.

ధనార్జనే ధ్యేయంగా...

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ ఏర్పడిన తర్వాత గొర్రెల సంత ఆదాయంపై స్థానిక టీడీపీ నేత కన్ను పడింది. ఈ నేపథ్యంలో మరికొందరితో కుమ్మక్కై 4 నెలలుగా అక్రమ వసూళ్లకు తెరలేపారు. ఈ క్రమంలో తమ దందాకు అనుకూలంగా ఉండేలా కుట్రలు పన్ని వ్యవసాయ మార్కెట్ సబ్ యార్డులోని గొర్రెల సంతను యాడికి నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న కోన రోడ్డుకు మార్చేలా చేశారు. ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కి మార్కెట్ యార్డు ఆదాయానికి భారీగా గండి కొట్టారు. ప్రభుత్వ నిబంధనల మేరకు గొర్రెలు, మేకలు విక్రయించిన వారి నుంచే నిర్ణీత రుసుం వసూలు చేయాల్సి ఉంది. అయితే ఇందుకు విరుద్ధంగా జీవాలు విక్రయించిన వారితో పాటు కొనుగోలు చేసిన వారి నుంచి కూడా రూ.20 వసూలు చేస్తున్నారు. చెల్లించకపోతే జీవాలను గేటు దాటనివ్వకుండా దౌర్జన్యాలకు దిగుతున్నారని పలువురు వాపోతున్నారు. ఇదే విషయాన్ని తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకరరెడ్డి, ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి దృష్టికి వ్యవసాయ మార్కెట్ అధికారులు తీసుకెళ్లారు. ఏటా గొర్రెల సంత ద్వారా మార్కెట్ యార్డుకు సమకూరుతున్న రూ.24 లక్షల ఆదాయానికి కొందరు టీడీపీ నేతలు గండి కొడుతున్నారని, ఈ అక్రమాలను అరికట్టాలని అభ్యర్థించినట్లు విశ్వసనీయ సమాచారం. అయినా దీనిపై ఎలాంటి చర్యలూ లేవు. మార్కెట్ యార్డు నుంచి బయటపడిన తర్వాత గొర్రెల సంతపై ఆదాయం స్థానిక పంచాయతీకి చెందాల్సి ఉంది. అయినా పంచాయతీకి నయాపైసా ఆదాయం సమకూరడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గతంలో మాదిరిగానే గొర్రెల సంతను వ్యవసాయ సబ్ మార్కెట్ యార్డుకు తరలించి, ఆదాయం ప్రభుత్వానికే సమకూరేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


గతంలో వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్వహిస్తున్న గొర్రెల సంత (ఫైల్)

నిజాయితీ చాటుకున్న ప్రైవేట్ టీచర్


బంగారు నగను అందజేస్తున్న విజయలక్ష్మి

కదిరి టౌన్: రోడ్డుపై తనకు లభించిన విలువైన బంగారు నగను పోలీసుల ద్వారా సంబంధీకుడికి చేర్చి ఓ ప్రైవేట్ టీచర్ తన నిజాయితీ చాటుకున్నారు. వివరాలు... కదిరిలోని బీడీ పరిశ్రమలో అకౌంటెంట్ పనిచేస్తున్న ఇబ్రాయేల్ శుక్రవారం సాయంత్రం వలీ సాహెబ్ రోడ్డులో ద్విచక్ర వాహనంపై వెళుతుండగా చేతి బ్యాగ్ జారి పోయింది. విషయాన్ని ఆయన గుర్తించలేక అలాగే ముందుకు దూసుకెళ్లి పోయాడు. అయితే అదే సమయంలో అటుగా వచ్చిన ఓ ప్రైవేట్ స్కూల్‌లో పనిచేస్తున్న టీచర్ విజయలక్ష్మి... రోడ్డుపై పడిన బ్యాగ్‌ను గుర్తించి తీసుకుని పరిశీలించారు. అందులో బంగారు గొలుసు ఉండడంతో వెంటనే తీసుకెళ్లి పోలీసులకు అప్పగించారు. బ్యాగ్‌లోని బంగారు గొలుసు విలువ రూ.4 లక్షలు ఉంటుందని అంచనా వేసిన పోలీసులు విషయాన్ని వెంటనే డీఎస్పీ శివనారాయణస్వామి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన చొరవ తీసుకుని విచారణ అనంతరం ఆ బ్యాగ్ పొగొట్టుకున్న ఇబ్రాయేల్‌ను ఆదివారం తన కార్యాలయానికి రప్పించుకుని విజయలక్ష్మి చేతుల మీదుగా ఇప్పించారు. నిజాయితీ చాటుకున్న విజయలక్ష్మిని ఈ సందర్భంగా డీఎస్పీ అభినందించారు.

జిల్లా అంతటా వర్షం


బుక్కపట్నం వద్ద రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

పుట్టపర్తి అర్బన్: తుపాను ప్రభావంతో రెండోరోజు ఆదివారం జిల్లా అంతటా వర్షం కురిసింది. 15 రోజులుగా తుంపరతో సరిపెడుతున్న వరుణ దేవుడు ఆదివారం సాయంత్రం మూడు నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు మోస్తరు వర్షం కురిపించాడు. రోడ్లపై వర్షం నీరు పారింది. కాలువలు పొంగిపొర్లాయి. ఇక వేరుశనగ విత్తుకోవచ్చని, ఆరుద్ర కార్తె ప్రవేశించిందని, మంచి అదనులో విత్తనం పడుతుందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఆర్డీటీని కాపాడుకుందాం


అనంతపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న క్రికెటర్లు

అనంతపురం: ఐదున్నర దశాబ్దాలుగా ఉమ్మడి జిల్లాలో విశిష్ట సేవలు అందించిన ఆర్డీటీని కాపాడుకుందామని సీనియర్ క్రికెటర్లు పిలుపునిచ్చారు. జిల్లా చరిత్రలో ఎన్నడూ లేని విధంగా సీనియర్ క్రికెటర్లు ఆర్డీటీ పరిరక్షణకు ఆదివారం కదం తొక్కారు. పెద్ద ఎత్తున ర్యాలీ చేపట్టిన రంజీ క్రీడాకారులు, మాజీ క్రీడాకారులు, మహిళా క్రికెటర్లు పెద్ద ఎత్తున పాల్గొని ' సేవ్ ఆర్డీటీ' అంటూ నినాదాలతో హోరెత్తించారు. అనంతపురంలోని టవర్‌క్లాక్ వద్ద ప్రారంభమైన కలెక్టర్ ఆఫీస్ వద్ద ఉన్న ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ విగ్రహం వరకూ కొనసాగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆర్డీటీని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఆర్డీటీకి అన్ని విధాలుగా క్రికెటర్లు తోడుగా ఉంటాం. ఆర్డీటీ సేవలు కొనసాగేలా సంస్థకు ఎఫ్‌సీఆర్ఏను రెన్యువల్ చేయాలంటూ ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆర్డీటీ సేవలు ఆగితే పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలు భారీగా నష్టపోతారన్నారు. నిరుపేదలకు వైద్య సేవలు, క్రీడాకారులకు చేయూత, పేద విద్యార్థులకు ఉన్నత విద్యకు దన్నుగా నిలుస్తున్న ఆర్డీటీ సేవలు కొనసాగేలా కేంద్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా క్రికెట్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు పగడాల మల్లికార్జున, సభాధ్యక్షుడు మచ్చా రామలింగారెడ్డి మాట్లాడుతూ.. కేంద్రం వెంటనే ఆర్డీటీ సంస్థకు ఎఫ్‌సీఆర్ఏ పునరుద్ధరణ చేసే వరకూ ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. ఐపీఎల్ క్రీడాకారుడు విజయకుమార్, ఏడీసీఏ జిల్లా కార్యదర్శి భీమలింగారెడ్డి, నార్పల సత్యనారాయణరెడ్డి, షాబుద్దీన్, ప్రసాదరెడ్డి, రంజీ క్రికెటర్లు సురేష్ మాట్లాడారు. కార్యక్రమంలో సీనియర్ క్రికెటర్లు శ్రీనివాసులు, కమలాకర్‌నాయుడు, సీతారామారావు, రవీంద్రనాథ్, చంద్రమోహన్‌రెడ్డి, రంజీ మాజీ క్రికెటర్లు ఫయాజ్, షాషా వలి, మురళి, సర్దార్, సాగర్, విజయ్‌రాజు, దాదా ఖలందర్, సాదిక్, రంజీ క్రికెటర్లు వినయ్‌కుమార్, మచ్చా దత్తారెడ్డి, కోగటం హనీష్ వీరారెడ్డి, దీపక్ తదితరులు పాల్గొన్నారు.

మారమన్నందుకు మట్టుబెట్టాడు!

- కుటుంబ కలహాల నేపథ్యంలో భార్యను కొట్టి చంపిన భర్త
- తొలుత మిస్సింగ్ కింద పోలీసులకు ఫిర్యాదు
- ముళ్లపొదల్లో లభ్యమైన మృతదేహం


కళావతి (ఫైల్)

కనగానపల్లి: వ్యసనాలు మాని కుటుంబపోషణపై దృష్టి సారించాలని హితవు పలికినందుకు కట్టుకునే భార్యనే ఓ కసాయి కడతేర్చిన ఘటన కనగానపల్లి మండలంలో సంచలనం రేకెత్తించింది. స్థానికులు, పోలీసులు తెలిపిన మేరకు... మండల కేంద్రం కనగానపల్లికి చెందిన బోయ రాఘవ, కళావతి (32) దంపతులకు ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. వ్యవసాయంతో కుటుంబాన్ని పోషించుకునేవారు. ఈ క్రమంలో ఏడాదిగా రాఘవ మద్యానికి బానిసగా మారి ఇతర వ్యసనాలనూ అలవర్చుకున్నాడు. దీంతో తరచూ ఇద్దరి మధ్య గొడవలు చోటుచేసుకునేవి.

కట్టెల కోసమని వెళ్లి...

శనివారం సాయంత్రం కట్టెల కోసమని గ్రామ శివారులోని ముళ్ల పొదల్లోకి కళావతితో పాటు రాఘవ వెళ్లాడు. ఆ సమయంలో వ్యసనాలు మానుకోవాలని మరోసారి రాఘవకు భార్య హితవు పలికింది. దీంతో ఆమెతో వాగ్వాదానికి దిగి కొడవలితో దాడి చేశాడు. కుప్పకూలిన భార్య తలపై కట్టెతో బాదడంతో అపస్మారక స్థితికి చేరుకుంది. ఆమెను అక్కడే వదిలేసి ఇంటికి చేరుకున్నాడు. ఆ తర్వాత ఆమె ప్రాణాలు వదిలింది.

మొదట మిస్సింగ్ కింద ఫిర్యాదు

చీకటి పడుతున్నా కుమార్తె ఇంటికి రాకపోవడంతో కళావతి తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంది. కుటుంబ సభ్యులతో కలసి ఆమె కోసం చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలించారు. ఆ సమయంలో వారితో పాటు రాఘవ కూడా ఉన్నాడు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో ఆదివారం ఉదయం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు ఆ దిశగా కళావతి కోసం గాలింపు చేపట్టారు. మధ్యాహ్నం గ్రామ సమీపంలోని ముళ్ల పొదల వైపుగా వెళ్లిన స్థానికులు అక్కడ మృతదేహాన్ని గుర్తించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు చేరుకుని పరిశీలించారు. కళావతి మృతదేహంగా గుర్తించి కుటుంబ సభ్యులకు తెలపడంతో వారు అక్కడకు చేరుకుని నిర్ధారించారు. విషయం తెలుసుకున్న రామగిరి సీఐ శ్రీధర్ వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. రాఘవ ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండడంతో అదుపులో తీసుకుని విచారణ చేయడంతో తానే హతమార్చినట్లు అంగీకరించినట్లు సమాచారం.


సంఘటనా స్థలం వద్ద విచారిస్తున్న పోలీసులు

స్థల వివాదంలో మరొకరి అరెస్ట్

పుట్టపర్తి టౌన్: కొత్తచెరువు స్థల వివాదం కేసులో మరొకరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ విజయకుమార్ తెలిపారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో కొత్తచెరువు సీఐ మారుతీ ప్రసాద్‌తో కలసి వివరాలను ఆయన వెల్లడించారు. కొత్తచెరువు నుంచి ధర్మవరానికి వెళ్లే మార్గంలో గత నెల 27న ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. దీనికి సంబంధించి నమోదైన కేసులో ఇప్పటి వరకూ 11మందిని అరెస్ట్ చేశారు. ఇదే కేసులో పరారీలో ఉన్న మెరిమిధశెట్టి పాండును కర్ణాటకలోని కొప్పల్ జిల్లా గంగావతి రోడ్డులో అదుపులోకి తీసుకుని కొత్తచెరువుకు తరలించారు. విచారణ అనంతరం అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. కాగా, నిందితుడు పాండు.. వివిధ రాష్ట్రాలలో 47 కేసుల్లో నిందితుడిగా ఉంటూ ఇప్పటికే జైలుకు వెళ్లి వచ్చాడు. పరారీలో ఉన్న మిగిలిన నిందితుల కోసం గాలిస్తున్నామని, త్వరలో వారిని కూడా అరెస్ట్ చేయబోతున్నట్లు పోలీసులు తెలిపారు.

మద్యం తాగొద్దన్నందుకు వ్యక్తి ఆత్మహత్యాయత్నం


చికిత్స పొందుతున్న ఏడుకొండలు

ధర్మవరం అర్బన్: భార్య మద్యం తాగొద్దన్నందుకు మనస్థాపానికి గురైన భర్త ఆత్మహత్యకు యత్నించాడు. వివరాలు.. పట్టణంలోని గీతానగర్‌కు చెందిన బేల్దారి పనిచేసే ఏడుకొండలు మద్యం తాగే అలవాటు ఉంది. తాగుడు మానేయాలని భార్య పావని చెప్పడంతో తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. ఈక్రమంలో ఆదివారం సాయంత్రం శ్మశాన వాటిక వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఘటనస్థలానికి చేరుకుని అతడిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పశుమాంసం పట్టివేత


పట్టుబడిన పశుమాంసం వాహనాలు

హిందూపురం: కర్ణాటకకు వాహనాల్లో తరలిస్తున్న పశు మాంసాన్ని హిందూపురం రూరల్ సీఐ ఆంజనేయులు దాడిచేసి పట్టుకున్నారు. హిందూపురం ప్రాంతంలో పశువుల(ఎద్దులు, ఆవుదూడలు)ను వధించి మాంసాన్ని గోనె, ప్లాస్టిక్ సంచుల్లో ప్యాక్ చేసి బెంగళూరుకు రవాణా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ వ్యవహారంపై సమాచారం అందడంతో రూరల్ పోలీసులు నిఘా పెట్టారు. ఆదివారం తెల్లవారుజామున ఆరు 406 వాహనాల్లో ఆరు టన్నుల పశు మాంసాన్ని తరలిస్తుండగా పట్టుకున్నారు. డ్రైవర్లను అరెస్టు చేసి, వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పట్టుబడిన మాంసాన్ని పరీక్షలు చేసిన తర్వాత కేసు నమోదు చేస్తామని సీఐ తెలిపారు. మాంసం వ్యాపారులు పరారీలో ఉన్నారని, వారి కోసం గాలిస్తున్నామని చెప్పారు.

కొట్టుకున్న టీడీపీ కార్యకర్తలు

కనగానపల్లి: మండలంలోని కుర్లపల్లి గ్రామంలో ఆదివారం టీడీపీ కార్యకర్తల మధ్యన ఘర్షణ చోటు చేసుకుని ఒకరినొకరు కొట్టుకున్నారు. స్థానికులు తెలిపిన మేరకు.. టీడీపీ కార్యకర్త శంకర్ గ్రామంలోని ఆలయం వద్ద ఆదివారం మద్యం సేవిస్తుండగా అటుగా వెళ్తున్న మరో టీడీపీ కార్యకర్త శ్రీకాంత్‌రెడ్డి గమనించి పక్కకు వెళ్లి తాగాలని హితవు పలికాడు. ఆ సమయంలో శ్రీకాంత్‌రెడ్డితో శంకర్ వాగ్వాదానికి దిగాడు. ఇద్దరి మధ్య మాటామాట పెరిగి కొట్టుకున్నారు. అనంతరం ఇద్దరూ కనగానపల్లి పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. పరస్పర ఫిర్యాదుల మేరకు ఇద్దరిపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

సడ్లపల్లె కథా పురస్కారాల ప్రదానం


రచయితలకు పురస్కారాలను అందజేస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: పట్టణంలోని టీచర్స్ కాలనీలో తపన సాహితీ వేదిక ఆధ్వర్యంలో సడ్లపల్లె కథా పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి రచయిత శశికళ అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథిగా డీఎస్పీ మహేష్ పాల్గొన్నారు. 2024వ సంవత్సరానికి గానూ చిత్తూరు జిల్లాకు చెందిన పలమనేరు బాలాజీ రాసిన 'ఏకలవ్య ఎరుకల కాలనీ జీవన గాథలు' అనే పుస్తకానికి, అలాగే తెలంగాణా రాష్ట్రం ఖమ్మం జిల్లాకు చెందిన స్వర్ణకిలారి రాసిన 'నల్ల బంగారం' అనే పుస్తకానికి 'సడ్లపల్లె కథా పురస్కారాలు అందజేశారు. అలాగే డాక్టర్ శాంతినారాయణ అధ్యక్షతన కాకినాడకు చెందిన ప్రజా వైద్యుడు డా.యనమదల మురళీకృష్ణ వైద్య సేవలకు గానూ 'తపన సాహిత్య వేదిక ' సేవా పురస్కారాన్ని అందజేసి, నగదు బహుమతితో పాటు సత్కరించారు. డీఎస్పీ మాట్లాడుతూ 100 కిలోమీటర్ల దూరంలోని బాలాజీ కథలను, 1000 కిలోమీటర్ల దూరం లోని స్వర్ణ కిలారీ కథలను చదివి పురస్కారాలు ఇవ్వడం హర్షణీయమన్నారు. తపన సాహిత్య వేదిక వ్యవస్థాపకుడు సడ్లపల్లె చిదంబరరెడ్డి మాట్లాడుతూ రచయితలు, కవులకు ప్రోత్సహించడమే తమ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ పెద్దిరెడ్డి, డాక్టర్ యమున, డాక్టర్ ప్రగతి, మానవ హక్కుల వేదిక ఎంఎం బాషా, జాబిలి చాంద్‌బాషా, కల్లూరు రాఘేంద్రరావు, రైతు నాయకుడు వెంకటరామిరెడ్డి, ఈశ్వరరెడ్డి, మానవత అమరనాథరెడ్డి, పౌర హక్కుల సంఘం శ్రీనివాసులు, యువకవి కైమలి, సిద్దగిరి శ్రీనివాస్, అశ్వత్థనారాయణ, యువకవి గంగాధర్, ఆంధ్రరత్న గంగధర్, ఉమర్ ఫారూక్ తదితరులు పాల్గొన్నారు.

మలి వయసులో ఆసరా

- 60 ఏళ్లు, అంతకుపైబడి వయసున్న వారికి సీనియర్ సిటిజన్ కార్డు
- ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తుకు అవకాశం
- జిల్లా కేంద్రాల్లోనే పొందే అవకాశం

మీ కోసం

అనంతపురం అర్బన్: సీనియర్ సిటిజన్ కార్డు ఒక్కటి ఉంటే చాటు ప్రభుత్వం నుంచి లభించే చాలా ప్రయోజనాలు అందుతాయి. 60 ఏళ్లు, ఆపై వయసున్న వారు సీనియర్ సిటిజన్ కార్డు పొందేందుకు అర్హులు. కార్డు తీసుకున్నవారికి ఆర్థిక, వైద్య, ప్రయాణ, పన్ను మినహాయింపు వంటి పలు ప్రయోజనాలు చేకూరుతాయి. పబ్లిక్ సెక్టార్ బ్యాంకుల్లో ఎఫ్‌డీలపై అధిక వడ్డీ రేట్లు ఉంటాయి. బీఎస్ఎన్ఎల్ వంటి ప్రభుత్వరంగ టెలికాం సంస్థలు సీనియర్ సిటిజన్లకు ప్రత్యేక ప్లాన్‌లు ఇస్తాయి. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ డిజిటల్ సేవల్లో సీనియర్ సిటిజన్ కార్డుకు ప్రత్యేక ప్రాధాన్యత ఉంటుంది.

ప్రయాణంలో రాయితీ

- రైల్వే, ఆర్టీసీ బస్సుల్లో సీనియర్ సిటిజన్లకు టికెట్ ధరపై తగ్గింపు ఉంటుంది
- ఐఆర్‌సీటీసీ లేదా టికెట్ బుక్కింగ్ సమయంలో రాయితీ వర్తిస్తుంది.
- విమాన ప్రయాణాల్లోనూ కొన్నిసార్లు రాయితీలు ఉంటాయి.
- బస్సు పాసు తీసుకుంటే నెలవారీ ప్రయోజనాలు ఎక్కువగా లభిస్తాయి.

ఆరోగ్య బీమా, వైద్య రాయితీ

- ప్రత్యేక ఆరోగ్య బీమా పాలసీలు అందుబాటులో ఉన్నాయి.
- వైద్య పరీక్షలు, చికిత్సలపై ఆస్పత్రుల్లో రాయితీలు లభిస్తాయి.
- ఔషధాల మీద కొన్ని ఫార్మసీల్లో తగ్గింపు లభిస్తుంది.
- ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రాధాన్యతగా వైద్యం అందిస్తారు.
- ఈఎస్ఐసీ, సీజీహెచ్ఎస్ పథకాల్లో సీనియర్ సిటిజన్లకు ప్రత్యేక సౌకర్యాలు ఉంటాయి.
- తలసేమియా, క్యాన్సర్, వైద్య రీయింబర్స్‌మెంట్ స్కీముల్లో అర్హత.

పన్ను మినహాయింపు

- ఆదాయ పన్నులో ప్రత్యేక మినహాయింపు ఉంటుంది.
- 2025–26లో రూ.3 లక్షల వరకు ఆదాయానికి పన్నులు చెల్లించనవసరం లేదు.
- 80డి కింద ఆరోగ్య బీమా ప్రీమియంపై అధిక మినహాయింపు ఉంటుంది.
- 80టీటీబీ కింద ఎఫ్‌డీల మీద వడ్డీ ఆదాయానికి రూ.50 వేల వరకు పన్ను మినహాయింపు ఉంటుంది.
- ఫారం 15 హెచ్ ద్వారా టీడీఎస్ మినహాయింపు పొందవచ్చు.
- పన్ను ఫైలింగ్‌ను సులభతరం చేసేందుకు ప్రత్యేక హెల్ప్ డెస్కులు ఉంటాయి.

దరఖాస్తు ఇలా

- రాష్ట్ర ప్రభుత్వ సీనియర్ సిటిజన్ పోర్టల్ లేదా సర్కారీ సువిధ (https://sarkarisuvidha. online/) వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.
- ఆమోదం పొందిన తరువాత సీనియర్ సిటిజన్ కార్డును ఆన్‌లైన్‌లోనే పొందవచ్చు.
- సమీపంలోని కామన్ సర్వీస్ సెంటర్ (సీఎస్‌సీ) లేదా నగర, పురపాలక సంఘం కార్యాలయం ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.



- దరఖాస్తు ఫారం, రెండు ఫోటోలు, చిరునామా, వయసు రుజువు పత్రాలను అధికారులకు అందించాలి.

అవసరమైన పత్రాలు..

- ఆధార్ కార్డు, ఓటర్ ఐడీ లేదా పాన్ కార్డ్
- జనన ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్ట్ లేదా పాన్‌కార్డ్
- విద్యుత్ బిల్, రేషన్ కార్డు, ఓటర్ ఐడీ
- ఇటీవల తీయించుకున్న పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు రెండు
- బ్యాంక్ పాస్‌బుక్
- ఆరోగ్య పత్ర ఏబీహెచ్‌ఏ కార్డు, హెల్త్ ఐడీ.